వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 003
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
డిసెంబర్ 03, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

# ఖబడ్దార్ రేవంత్ రెడ్డి..

- హిందూ దేవతల జోలికి వస్తే ఊరుకునేది లేదు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్




8లో..

## గళ మెత్తిన నాలుగో స్తంభం

- సమస్యల పరిష్కారం కోరుతూ మహా ధర్నా
- హైదరాబాద్ కు భారీగా తరలిన జర్నలిస్టు నాయకులు



2లో..

## విద్యుత్ బిల్లుల చెల్లింపు సులభతరం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- ఆన్ లైన్ పేమెంట్ సిస్టం ప్రారంభం



2లో..

## తక్షణ సాయం అందించాలి

- మొంథా తాఫాన్ తో వరంగల్ కు భారీ నష్టం
- రోడ్లు,డ్రైనేజీల పునరుద్ధరణకు రూ.100 కోట్లు మంజూరు చేయాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



8లో..

## చిత్రం ఉద్యమ సజీవ దృశ్యం

☐ దాస్యం వినయ్ భాస్కర్

వివరాలు2లో..

# గ్రామాల్లో... ఓట్ల పండుగ






- మొదటి విడతకు లైన్ క్లియర్
- పూర్తయిన ఉపసంహరణలు
- ప్రారంభమైన ఇంటింటి ప్రచారాలు
- గుర్తుల కేటాయింపులో అధికారులు బిజీబిజీ
- ప్రారంభమైన మూడో విడత నామినేషన్ల పర్వం

తెలంగాణ పల్లెల్లో ఓట్ల పండుగ సాగుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి జోరందుకుంది. ఊరూ, వాడ ఒక్కటై తమ గ్రామ మొదటి పౌరుడిని ఎన్నుకునేందుకు సిద్ధపడుతున్నారు. పార్టీ రహితంగా నిర్వహించనున్న ఈ ఎన్నికల తొలి విడత నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 27నుంచి 29 వరకు నిర్వహించగా, 30న నామినేషన్ పత్రాల పరిశీలన, డిసెంబర్ 1న ఫిర్యాదుల స్వీకరణ, 2న వాటి పరిష్కారం, 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ తంతును ముగించారు. దీంతో మొదటి విడత ఎన్నికలకు లైన్ క్లియర్ అయింది. అదే విధంగా రెండో విడత నామినేషన్ల ప్రక్రియ పూర్తికాగా, మూడో విడత ఎన్నికలకు బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. అయితే తొలి విడత నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించడంతోపాటు వారికి గుర్తులు కేటాయించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. నువ్వా.. నేనే అన్నట్లుగా సాగుతున్న పంచాయతీ ఎన్నికల పోరులో విజయమే లక్ష్యంగా అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

# గ్రామాల్లో.. ఓట్ల పండుగ

- మొదటి విడతకు లైన్ క్లియర్
- పూర్తయిన ఉపసంహరణలు
- ప్రారంభమైన ఇంటింటి ప్రచారాలు
- గుర్తుల కేటాయింపులో అధికారులు బిజీబిజీ
- ప్రారంభమైన మూడో విడత నామినేషన్ల పర్వం




**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లోని 564 మండలాల్లోని 12,728 గ్రామ పంచాయతీలు, 1,12,242 వార్డులకు ఈ నెల 11,14,17 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ అయింది. వివిధ కేసుల నేపథ్యంలో కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినందున 32 గ్రామ పంచాయతీలు, 292 వార్డుల్లో ఎన్నికలకు బ్రేక్ పడింది. మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు నవంబర్ 27 నుంచి 29 వరకు నామినేషన్లు స్వీకరించారు. నవంబర్ 30 న నామ పత్రాల పరిశీలన, డిసెంబర్ 1న అభ్యంతరాల స్వీకరణ, 2న వారటి పరిష్కారం పూర్తి చేశారు. డిసెంబర్ 3వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు చాన్స్ ఉంది. సమయం ముగియడంతో అభ్యర్థుల తుది జాబితా ప్రకటనపై అధికారులు దృష్టి సారించారు. మొదటి దశలో 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడత సర్పంచ్ ఎన్నికలకు డిసెంబర్ 11న ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలనుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాల వెల్లడితో పాటు ఉప సర్పంచ్ ఎన్నికను సైతం అదే రోజు నిర్వహించనున్నారు.

### తెలుగు అక్షర క్రమంలో..

మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితా ఖరారైంది. దీంతో అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రక్రియ స్పీడందుకుంది. పంచాయతీ ఎన్నికల్లో గుర్తుల కేటాయింపు పూర్తిగా తెలుగు అక్షర క్రమం ఆధారంగా ఉండనుంది. అభ్యర్థులు నామపత్రాల్లో తమ పేరును ఏ విధంగా పేర్కొంటే.. ఆ పేరులోని మొదటి అక్షరం ఆధారంగానే గుర్తుల కేటాయింపు జరుగుతుంది. కొందరు అభ్యర్థులు తమ ఇంటిపేరును ముందుగా, మరికొందరు తమ పేరును ముందుగా పేర్కొంటారు. పేరుకు ముందు భాగంలో ఉన్న అక్షరం ఆధారంగానే ఈ క్రమాన్ని నిర్ణయిస్తారు. ఇది అభ్యర్థులు తమ బ్యాలెట్ స్థానాన్ని ప్రభావితం చేయడానికి ఉపయోగించే ఒక వ్యూహం కూడా. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే తమ నిరసనను తెలియజేసేందుకు 'నోటా' గుర్తు కూడా అందుబాటులో ఉంటుంది.

### 30 గుర్తులు..

సర్పంచి ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం 30 ప్రత్యేక గుర్తులను కేటాయించింది. ప్రాధాన్యత క్రమంలో ఉంగరం, కత్తెర, బ్యాటు, ఫుట్‌బాల్, లేడీ పర్సు, టీవీ రిమోట్, టూత్‌పేస్టు, స్పానర్ (పానా), చెత్తడబ్బా, నల్లబోర్డు, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్‌హ్యాండిల్, టీ జల్లెడ, మంచం, టేబుల్, బ్యాటరీ లైట్, బిస్కెట్, వేణువు, చెప్పులు, గాలి బుడగ, క్రికెట్ స్టంప్స్ వంటి నిత్యజీవితంలో ఉపయోగించే వస్తువులకు సంబంధించిన గుర్తులు కేటాయించారు. సర్పంచి అభ్యర్థులకు సంబంధించిన గుర్తులను గులాబీ రంగు బ్యాలెట్ పేపర్‌పై ముద్రించనున్నారు.

### వార్డు సభ్యులకు 20 గుర్తులు..

గ్రామాల్లో ఎన్నికల కోడ్, పోలింగ్ ఏర్పాట్లకు సంబంధించిన చర్యలను అధికారులు వేగవంతం చేశారు. వార్డు సభ్యుల ఎన్నికల కోసం ఎన్నికల సంఘం 20 గుర్తులను కేటాయించింది. నోటాతో కలిపి మొత్తం 21 గుర్తులు ఉంటాయి. గౌను, గ్యాస్ పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, ఈల, కుండ, డిష్ ఆంటినా, గరాటా, మూకుడు, ఐస్‌క్రీమ్, గాజు గ్లాసు, పోస్టు డబ్బా, కవరు, హాకీ కర్ర బంతి, నెక్‌టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్తు స్తంభం, కెటిల్, నోటా వంటి సాధారణ గుర్తులను కేటాయించారు. వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన గుర్తులను తెల్ల రంగు బ్యాలెట్ పేపర్‌పై ముద్రించనున్నారు. గుర్తుల కేటాయింపు పూర్తయిన వెంటనే.. ఆయా గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియకు అవసరమైన బ్యాలెట్ పేపర్లను ముద్రించి పంపిణీ చేయనున్నారు. తొలి విడత ఎన్నికలకు ఈనెల 11న పోలింగ్, అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు.

### జోరుగా ఇంటింటి ప్రచారాలు..

తొలి విడత నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారాలకు పదును పెడుతున్నారు. ఇంటింటి ప్రచారాలకు శ్రీకారం చుట్టారు. పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహిస్తున్నప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీలు తాము బలపర్చిన అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధికి బాటలు వేస్తామంటూ వాగ్దానాలు చేస్తున్నారు.

# తక్షణ సాయం అందించాలి

- మొంథా తాఫాన్ తో వరంగల్ కు భారీ నష్టం
- రోడ్లు,డ్రైనేజీల పునరుద్ధరణకు రూ.100 కోట్లు మంజూరు చేయాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరంలో అక్టోబర్ నెలలో మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలు, భారీ నష్టంపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో జీరో అవర్‌లో గళమెత్తారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 20 సెంటీ మీటర్లకు పైగా వర్షం కురవడంతో శివనగర్, ఎన్ఎన్‌నగర్, డీకేనగర్ సహా 45 కాలనీలు ముంపుకు గురయ్యాయని ఎంపీ వివరించారు. పోతన రోడ్, భద్రకాళి–పాలిటెక్నిక్ రోడ్, ములుగు రోడ్, బొందివాగు, పోచమ్మమైదాన్ 80 అడుగుల రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారిందని, కొన్ని ప్రాంతాల్లో రహదారులు నదులుగా మారాయని కడియం కావ్య పేర్కొన్నారు. ఆ సమయంలో ఒక గర్భిణిని ట్రాక్టర్‌లో తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు అమృత్ 2.0 కింద ప్రత్యేక నిధులు మార్చి 2026లోగా విడుదల చేయాలని, జీడబ్ల్యూఎంసీ మౌలిక వసతులపై ఉన్నత స్థాయి ఆడిట్ కు ఆదేశించాలని, రహదారుల పునర్నిర్మాణానికి రూ.100 కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని ఆమె కేంద్రాన్ని కోరారు.



# న్యాయం జరుగుతుందన్న భరోసా కల్పించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో రిసెప్షన్ ప్రారంభం

**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీస్ స్టేషన్ కు వెళితే న్యాయం జరుగుతుందన్న భరోసాను ప్రజల్లో కల్పించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ ప్రాంగణాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ శాఖకు గౌరవమర్యాదలు తీసుకువచ్చే విధంగా అధికారులు, సిబ్బంది వ్యవహరించాలన్నారు. రౌడీ షీటర్ల పట్ల మెతక ధోరణితో వ్యవహరించవద్దన్నారు. ఫిర్యాదులు వచ్చిన తక్షణమే స్పందించాలన్నారు. నేరాల నియంత్రణకు విజుబుల్ పోలీసింగ్ అవసరమని సీపీ అధికారులు, సిబ్బందికి సూచించారు. సీపీ చేతుల మీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, ఎ.ఎస్పీ శుభం ప్రకాష్, ఇన్ స్పెక్టర్ రమేష్ తో పాటు ఎస్సైలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పూర్వ పాఠశాలను సందర్శించిన మాడభూషి శ్రీధర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర మాజి సమాచార శాఖ కమిషనర్ మాడభూషి శ్రీధర్ తన పూర్వ పాఠశాలను బుధవారం సందర్శించాడు. ఎల్ బి నగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాసూమ్ అలిలో 55సంవత్సరాల క్రితం విద్య నభ్యసించిన ఆయన గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బీవీఎన్ స్వామికి, ఉపాధ్యాయులకు మాడభూషి శ్రీధర్ ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయబాలరెడ్డి, కనకయ్య, భిక్షపతి, ఠయ్యాల శ్రీధరాచార్యులు, దేవేందర్, మోహన్, బాష్కర్ తదితరులు పాల్గోన్నారు. దాదాపు గంట నుంచి రెండు గంటల వరకు పాఠశాల పూర్వ విద్యార్థిగా మధురమైన తన పాఠశాల జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు.

# విద్యుత్ బిల్లుల చెల్లింపు సులభతరం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- ఆన్ లైన్ పేమెంట్ సిస్టం ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అధునాతన సాంకేతికత పరిజ్ఞానాన్నివిద్యుత్ వినియోగదారుల ముంగిటకు తీసుకొచ్చినట్లు టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్ లైన్ పేమెంట్ సిస్టం (కియోస్క్) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ సేవలను పూర్తిగా డిజిటల్ వైపునకు మళ్లిస్తూ, వినియోగదారులకు మరింత వేగంగా, పారదర్శకంగా, క్యూలో నిలబడకుండా తమ బిల్లులను చెల్లించుకోగలిగేలా రూపొందించిన ఆన్‌లైన్ పేమెంట్ సిస్టమ్ (కియోస్క్) యూనియన్ బ్యాంకు సహకారంతో పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపట్టామని తెలిపారు. త్వరలో మరిన్ని ఈఆర్వో కేంద్రాల్లో ప్రారంభిస్తామని చెప్పారు. విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వచ్చే వినియోగదారులు ఇక్కడ అందుబాటులో ఉంచిన కియోస్క్ ద్వారా తక్కువ సమయంలో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. కియోస్క్ లో సంబంధిత విద్యుత్ బిల్లు పైన ఉన్న యూనిక్ సర్వీస్ నంబర్ నమోదు చేస్తే సంబంధిత వివరాలు కనిపిస్తాయని, అందులో పేమెంట్ ఆప్షన్ కు వెళ్లగానే క్యూఆర్ కోడ్ వస్తుందని, వినియోగదారుడి మొబైల్ లో యూపీఐ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బిల్లు చెల్లించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫైనాన్స్ వి.తిరుపతి రెడ్డి, సీజియం ఆర్.చరణ్ దాస్, సీఈ శ్రవణ్ కుమార్, జీఎం శ్రీనివాస్, హనుమకొండ ఎస్ఈ మధుసూదన్ రావు, ఎస్ఏఓ నవీన్ కుమార్, డీఈ టెక్నికల్ విజయేందర్ రెడ్డి, హనుమకొండ టౌన్ డీఈ సాంబ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఏజీఎంలు వై.శ్రీకాంత్ కుమార్, మహేష్, చీఫ్ మేనేజర్ పీవీ.చైతన్య రెడ్డి పాల్గొన్నారు.

# మార్కెట్ హమాలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

**◆ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్**




**వరంగల్ వాయిస్, ఏనుమాముల మార్కెట్:** ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ హమాలీలు బుధవారం నిరసన చేపట్టారు. యూనియన్ అధ్యక్షులు ఎస్.కె.హాఫీజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునీశ్వర్ మాట్లాడుతూ ఏనుమాముల మార్కెట్ యార్డ్‌లో దాదాపు 6,000 మంది హమాలీలు (దడువాయ్, స్వీపర్, చాట, ఎడ్లబండ్ల కార్మికులు) పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరికీ అర్హత ప్రకారం లైసెన్సులు, గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం తక్షణమే కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో పనిచేసే సమయంలో గానీ, మార్కెట్‌కు వచ్చి ఇంటికి వెళ్లే సమయంలో గానీ ప్రమాదం జరిగితే, కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండేందుకు రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. గతంలో ప్రభుత్వం ఇన్సూరెన్స్ మొత్తాన్ని పెంచినా, జీవో ఇవ్వకుండా అలసత్వం చేసిందని, ఈసారి అటువంటి పరిస్థితి రాకుండా చూడాలని కోరారు. అర్హులైన ప్రతి హమాలీకి లైసెన్సులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలి. గుమస్తా దాడువాయ్‌లకు విశ్రాంతి గది ఉన్నట్టుగానే, మార్కెట్ హమాలీ కార్మికులకు కూడా ప్రత్యేకంగా విశ్రాంతి గది సౌకర్యం కల్పించాలి. మార్కెట్ యార్డ్‌లో పనిచేసే వారికి మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, యూనిఫాం సౌకర్యంతో పాటు, సైకిల్ పెట్టుకోవడానికి సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హమాలీ, దాడువాయి, చాట, స్వీపర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కృష్ణ, పిట్టల వెంకన్న, గంధం భాస్కర్, గోర్రె శేఖర్, గాజర్ల శ్రీనువాస్, గొల్ల కుమార్, రాంబాబు, రాజు, కంప జనార్దన్, కంప రాజు, జి.కమలాకర్, మనోహర్, దాసు, సది, సెంసు తదితర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్‌తో ఎలక్ట్రికల్ వస్తువులు ధ్వంసం

**నష్టపరిహారం చెల్లించాలని కార్పొరేటర్ డిమాండ్**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరం 40వ డివిజన్‌లోని గుండు మైసమ్మ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన ఫీడర్ ఓవర్ లోడ్ కావడం వలన ఉర్సు ప్రతాప్ నగర్‌లోని పలు ఇళ్లలో ఎలక్ట్రిక్ వస్తువులు పొగలు వచ్చి పాడైపోయినాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మరుపల్ల రవి వెంటనే ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అధికారులైన డీఈ శంకేసి మల్లికార్జున్, ఏడీఈ పి.నాగేశ్వరరావు, ఏఈఈ డి.సంపత్ లకు సమాచారం అందించారు. కార్పొరేటర్ ఫిర్యాదు మేరకు అధికారులు వెంటనే స్పందించి, లైన్ మెన్‌లను పంపించారు. లైన్ మెన్‌లు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కరెంట్‌ను ఆఫ్ చేశారు. వారు పాడైపోయిన పలు ఇళ్లను పరిశీలించారు. సిబ్బంది ఓవర్ లోడ్ అయిన కరెంట్‌ను నియంత్రించి, సాంకేతిక సమస్యను పరిష్కరించిన తర్వాత, మళ్లీ కరెంట్‌ను సరఫరా చేశారు. అనంతరం కార్పొరేటర్ మరుపల్ల రవి, నష్టపోయిన ఇళ్లను పరిశీలించి, బాధితులతో మాట్లాడారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగానే ఈ నష్టం జరిగిందని ఆయన పేర్కొన్నారు. పలు ఇండ్లలో కాలిపోయిన వస్తువులను పరిశీలించిన కార్పొరేటర్ రవి, ధ్వంసమైన ఎలక్ట్రికల్ వస్తువులకు ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ వారే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓవర్ లోడ్ సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

# రిటైర్డ్ హెడ్ మాస్టర్ తల్లి మృతి

**నివాళులర్పించిన పరకాల పట్టణ నాయకులు**



**వరంగల్ వాయిస్, పరకాల:** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డుకు చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఆకునూరి విజయ్ కుమార్ తల్లి ఆకునూరి దేవకరుణ సుందర్ రావు ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతి చెందిన దేవకరుణ చిత్ర పటానికి పరకాల పట్టణ నాయకులు నివాళులర్పించారు. బుధవారం (మూడవ దినం సందర్భంగా) సీఎస్ఐ మిషన్ స్కూల్ దగ్గరలోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పాల్గొన్నారు. వారితో పాటు నివాళులర్పించిన వారిలో ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి , మాజీ కౌన్సిలర్ ఏకు రాజు, మాజీ కౌన్సిలర్ నల్లెల్ల అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు గూడెల్లి సదన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు ఎండీ అలీ, మునిగంటి విష్ణువర్ధన్, బొచ్చు జెమిని, బొచ్చు కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆకునూరి దేవకరుణ సుందర్ రావుకి శ్రద్ధాంజలి ఘటించారు.

# ఫాసిస్ట్ వ్యతిరేక సదస్సును విజయవంతం చేయండి

**◆ సామాజిక, ప్రజా, విద్యార్థి సంఘాల పిలుపు**

**◆ 6న హైదరాబాద్ లో అఖిల భారత సదస్సు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రస్తుతం దేశం సంక్లిష్టమైన పరిస్థితుల్లో ఉందని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సామాజిక, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాల కారణంగా పేద ప్రజలు నలిగిపోతున్నారని, అదే సమయంలో సీఏఏ, ఎన్ఆర్సీ వంటి విధానాలను తీసుకువస్తూ ప్రజల మధ్య మత విద్వేష పూరిత కార్యాచరణను ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక మార్గదర్శకత్వంలో పనిచేస్తూ, దేశంలో మనువాద ఆలోచనలు, నియమాలను అమలు చేసే ప్రయత్నం జరుగుతోందని నేతలు పేర్కొన్నారు. పేద ప్రజలను మత విద్వేషాలతో విభజిస్తూ పాలిస్తున్నారని, కార్పొరేట్ ప్రపంచీకరణ విధానాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో, దేశంలోని ప్రజాస్వామ్యవాదులు అందరూ కలిసి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నేతలు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే 6న హైదరాబాద్, ఎల్బీనగర్‌లో జరగనున్న అఖిల భారత ఫాసిస్ట్ వ్యతిరేక సదస్సును ప్రజలు, ప్రజాస్వామ్య శక్తులు, విద్యార్థులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సామాజిక, ప్రజా, విద్యార్థి సంఘాల తరఫున నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చారువాక రాష్ట్ర అధ్యక్షులు, సైంటిఫిక్ స్టడీ ఫోరం, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, టీయూసీఐ హనుమకొండ కన్వీనర్ కుమారస్వామి, భారత్ బచావో నాయకులు ప్రవీణ్ కుమార్, సీపీయూఎస్ఐడీబీఎస్వీ వరంగల్ జిల్లా కార్యదర్శి గడ్డం శరత్, పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సభ్యులు సంపత్ కుమార్, సామాజిక కార్యకర్త గురుమిళ్ల రాజు, తదితరులు పాల్గొని దేశంలో నెలకొన్న పరిస్థితులపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# పెగడపల్లి పీఏసీఎస్ సెక్రటరీ తొలగింపు

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి:** పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎం.యశ్వంత్‌ను ఆయన బాధ్యతల నుంచి తొలగిస్తూ జిల్లా సహకార అధికారి (డీసీఓ), హనుమకొండ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రుణమాఫీ ప్రతిపాదనలను నిబంధనలకు విరుద్ధంగా పంపడం, రైతుల రుణ ఖాతాల నిర్వహణలో వైఫల్యం, సంఘం ఆదాయ పన్ను రిటర్న్‌లను సకాలంలో ఐటీ శాఖకు సమర్పించకపోవడం వంటి పలు అంశాలపై ఆయన తీవ్రమైన అలసత్వం వహించినట్లు తేలడంతో ఈ చర్య తీసుకున్నారు. పెగడపల్లి సొసైటీ ఆర్థిక వ్యవహారాలు, రైతులకు సంబంధించిన కీలక లావాదేవీలలో యశ్వంత్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా సంఘానికి చెందిన ఆదాయ పన్ను రిటర్న్స్‌ను గడువులోగా దాఖలు చేయకపోవడం వలన సొసైటీకి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. యశ్వంత్ తొలగింపుతో ఖాళీ అయిన పెగడపల్లి కార్యదర్శి బాధ్యతలను మల్లారెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యదర్శి అయిన సీహెచ్ గణేష్‌కు అప్పగిస్తూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే పెగడపల్లి ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాలని గణేష్‌ను ఆదేశించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



**వరంగల్ వాయిస్, మల్హర్:** మండలంలోని రుద్రారం, ఎడ్లపల్లి, కొయ్యూరు, వల్లెంకుంట, కొండంపేట గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ వరి ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. అదనపు కలెక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలి. కొనుగోలు వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలి. కేంద్రాల్లో రైతులకు తాగు నీరు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలి. ట్యాబ్ ఎంట్రీలో ఎటువంటి పొరపాట్లు జరగకూడదు. పొరపాట్లు జరిగితే దానికి ఇన్‌చార్జీలే బాధ్యత వహించాలి. ఈ తనిఖీ కార్యక్రమంలో పాలు పంచుకున్న అధికారులలో పౌర సరఫరా శాఖ అధికారి కిరణ్ కుమార్, తహసీల్దార్ రవి కుమార్, ఏవో శ్రీజ, ఏఈవో అనూష, కొయ్యూరు సెంటర్ ఇన్‌చార్జి బొబ్బిలి కిరణ్ ఉన్నారు.

# నామినేషన్ కేంద్రాల పరిశీలన



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని మూడవ విడత సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ కేంద్రాలలో ఏర్పాట్లను హనుమకొండ జిల్లా జడ్పీ సీఈఓ, అసిస్టెంట్ డిప్యూటీ ఎలక్షన్ అథారిటీ బి.రవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు క్లస్టర్లలోని నామినేషన్ కేంద్రాలకు విచ్చేసి, నామినేషన్ల స్వీకరణకు అవసరమైన వసతులను, ఏర్పాట్లను పర్యవేక్షించారు. డిప్యూటీ ఎలక్షన్ అధికారి రవి ముస్త్యాలపల్లి క్లస్టర్: (ముస్త్యాలపల్లి, నడికూడ, చౌటుపర్తి), కంతాత్మకూర్ క్లస్టర్: (కంతాత్మకూర్, ధర్మారం, రామకృష్ణాపూర్), కౌకొండ క్లస్టర్: (కౌకొండ, సర్వాపూర్) లను పరిశీలించారు. ఈ పర్యవేక్షణలో డిప్యూటీ ఎలక్షన్ అధికారి రవి గారితో పాటు పరకాల ఆర్డీఓ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ రాణి, ఎంపీఓ మార్గవి రెడ్డి, ఎఫ్ ఎస్ టీ టీం ఉదయ్ కుమార్, కెమెరామెన్ రమేష్, అలాగే ఆర్ఓ, ఏఆర్ఓ పంచాయతీ కార్యదర్శులు భార్గవి, నాగరాజు, భిక్షపతి, కరుణ, స్వప్న, శ్రావ్య, కారోబార్‌లు రమేష్, రాజయ్య, రామన్న, శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు రవి సూచించారు.

# వృద్ధురాలికి శస్త్రచికిత్స విజయవంతం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** వరంగల్‌లోని సీకేఎం గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్ వైద్య బృందం ఒక అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. దాదాపు 75 ఏళ్ల వయస్సు గల వృద్ధ మహిళకు 5 కిలోల బరువున్న భారీ అండాశయ గడ్డ (ఓవరియన్ సిస్టు) ను తొలగించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. దాదాపు రెండేళ్లుగా పొత్తికడుపు భారీగా ఊబడంతో, నడవడం, రోజువారీ పనులు చేసుకోవడం ఆ వృద్ధ మహిళకు కష్టంగా మారింది. వయసు అధికంగా ఉండడం కారణంగా చాలా ఆసుపత్రులు శస్త్రచికిత్సకు ముందుకు రాకపోవడంతో, చివరకు ఆమెను సీకేఎం హాస్పిటల్‌కి రిఫర్ చేశారు. వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించిన తర్వాత, శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. శస్త్రచికిత్సలో భాగంగా, సుమారు 30 × 35 సెంటీమీటర్ల పరిమాణం, 5 కిలోల బరువు గల భారీ అండాశయ గడ్డను (ఓవరియన్ సిస్టు) వైద్యులు పూర్తిగా తొలగించారు. శస్త్రచికిత్స తరువాత రోగి పరిస్థితి స్థిరంగా ఉంది. ప్రస్తుతం ఆమె ఐసీయూలో వైద్యుల నిశిత పర్యవేక్షణలో ఉండి, క్రమంగా ఆరోగ్యం మెరుగుపడుతోంది. ఈ సంక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన వైద్య బృందం ప్రసూతి అండ్ స్త్రీరోగ విభాగం డా.స్వరూప (విభాగాధిపతి), డా.లక్ష్మీదేవి (హాస్పిటల్ సూపరింటెండెంట్), డా.జ్యోతిర్మయి (అసోసియేట్ ప్రొఫెసర్, బృంద నాయకురాలు), సర్జికల్ బృందం సీనియర్ రెసిడెంట్లు డా.జారా, డా.స్నేహ, రెసిడెంట్లు డా.మౌనిక, డా.అఖిల, డా.నమ్రత, డా.సుష్మిత, డా.చిన్మయి, డా.షబీనా, అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ డా.బేబీ రాణి, డా.యాస్మిన్ అంజుమ్, డా.సైఫ్, డా.రమేష్, నర్సులు సౌజన్య, సుగుణ, అనస్థీషియా బృందం శస్త్రచికిత్స మొత్తం సమయంలో రోగిని నిశితంగా పర్యవేక్షిస్తూ, ఆమెను సురక్షితంగా ఉంచడంలో కీలక పాత్ర పోషించింది. వయసు మీదపడిన రోగికి ఇంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడంపై ఆసుపత్రి వైద్య బృందాన్ని పలువురు అభినందించారు.

# డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మేయర్ సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పేయ్ ఆదేశాల మేరకు బుధవారం 32వ డివిజన్‌లో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కార్పొరేటర్ పల్లం పద్మ రవి డివిజన్ ప్రజలకు పలు విజ్ఞప్తులు చేశారు. ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి, తప్పనిసరిగా చెత్త బండిలో వేయగలరు. విజన్ ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, 32వ డివిజన్‌ను నగరంలోనే ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దాలని కోరారు. నేటి నుంచి ప్లాస్టిక్ కానీ, మరే ఇతర వ్యర్థాలను కానీ మోరీల్లో వేయవద్దు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పెనాల్టీ విధించడంతో పాటు చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హెచ్చరించారు. ఈ పరిశుభ్రత కార్యక్రమంలో ప్రతి మహిళా పాల్గొనాలని, తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజు, జవాన్ కిరణ్, రాము, బాలు, ఓబి, మమత, నీలం, శాంతపద్మ పాల్గొన్నారు.

# ప్రారంభమైన మూడో విడత నామినేషన్ల పర్వం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మూడో విడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు నామినేషన్లు స్వీకరిస్తున్నారు. తొలి రోజు కావడంతో నామినేషన్లు తక్కువ సంఖ్యలో నమోదైనట్టు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. అయితే, గురువారం, శుక్రవారం రోజుల్లో భారీ స్థాయిలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నామినేషన్ల కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కొయ్యూరు పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

# కోగిలవాయి సర్పంచ్ అభ్యర్థిగా చుక్క వనిత నామినేషన్



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని కోగిలవాయి గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి, భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులు బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు.కోగిలవాయి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా చుక్క వనిత మహేందర్ మాదిగ నామినేషన్ వేశారు. వారితో పాటు వివిధ వార్డుల సభ్యులుగా నామినేషన్ దాఖలు చేశారు. 3వ వార్డుకు గుండా కీర్తి, 4వ వార్డుకు గడబోయిన రమేష్ యాదవ్, 5వ వార్డుకు జంగిలి నవ్య శ్రీ, 6వ వార్డుకు పాలకుర్తి శ్రీలత గౌడ్, 7వ వార్డుకు పెరుగు కుమారస్వామి యాదవ్, 9వ వార్డుకు పెరుగు స్పందన యాదవ్, 10వ వార్డుకు పున్నం చందులు నామినేషన్ వేశారు. నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ అభ్యర్థి పగడాల ఖాళీ ప్రసాద్ రావు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు జంగిలి నాగరాజ్ పాల్గొన్నారు. గ్రామ కమిటీ సభ్యులు గడ్డం కుమార స్వామి, గుండా రాజు, గోల్కొండ రవి, పెరుగు రాజు యాదవ్, పోటు అనిల్ యాదవ్, పొన్నం వేణు, చుక్క ప్రశాంత్ తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలపై సీఎం స్పందించాలి




◆ కాకతీయ యూనివర్సిటీ అసోసియేషన్ విజ్ఞప్తి

**వరంగల్ వాయిస్, సుబేదారి :** ఈ నెల 7న ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలపై స్పందించి, సానుకూలమైన నిర్ణయాన్ని ప్రకటించాలని కాకతీయ యూనివర్సిటీ పార్ట్ టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జనరల్ సెక్రటరీ నరేంద్రనాయక్ అధ్యక్షతన జరిగిన పార్ట్ టైం అధ్యాపకుల సమావేశంలో డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఏ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకపోవడం వలన, పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలు ఆరు నెలల జీతాలు, అర్ధాకలి బ్రతుకులుగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన పార్ట్ టైం అధ్యాపకులను కాంట్రాక్ట్ అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలి. ప్రతి పీరియడ్‌కు ఇస్తున్న రెమ్యూనరేషన్‌ను రూ.1500లకు పెంచాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓయూ వేదికగా ఈ సమస్యలపై సానుకూలమైన ప్రకటన చేస్తారని తాము ఆశిస్తున్నామని ఆయన తెలియజేశారు. అసోసియేషన్ సలహాదారులు డాక్టర్ తిరునహరి శేషు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న 713 మంది పార్ట్ టైం అధ్యాపకులను కాంట్రాక్ట్ అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేసి, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా నెలకి రూ.₹50,000 వేతనం ఇచ్చినా, సంవత్సరానికి ప్రభుత్వంపై కేవలం రూ.6 కోట్ల నుంచి రూ.9 కోట్ల అదనపు భారం మాత్రమే పడుతుందని వివరించారు. కాబట్టి అధ్యాపకుల సమస్యల పట్ల ముఖ్యమంత్రి సానుకూలమైన నిర్ణయం ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దేవోజి నాయక్, పైండ్ల కిరణ్, వెన్నంపల్లి విజయకుమార్, తాళ్లపల్లి సంజీవ్, బూర శ్రీధర్, సదానందం, నివాస్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ పత్రాల పంపిణీ సక్రమంగా జరగాలి

◆ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ:** గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోస్టల్ బ్యాలట్ పత్రాలను సర్వీస్ ఓటర్లకు, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు సరిగ్గా పంపిణీ జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పోస్టల్ బ్యాలట్ పంపిణీ, నిర్వహణపై బుధవారం ఆయన అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జడ్పీ సీఈఓ, డీపీఓ, అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలతో గూగుల్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్ రామరాజు పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా అధికారులకు పోస్టల్ బ్యాలట్ ప్రక్రియపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులకు పలు కీలక ఆదేశాలు ఇచ్చారు. మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో ఈ నెల 9న ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. రెవెన్యూ శాఖ అధికారి గెజిటెడ్ అధికారిగా ఉండి, ఫారం 17లో సంతకం చేయడానికి అందుబాటులో ఉండాలి. ఎవరికైతే పోస్టల్ బ్యాలట్ ఇస్తున్నారో వారి వివరాలను ఒక రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఓటరు సహాయక కేంద్రంలో ఓటింగ్ గోప్యతకు భంగం కలగకుండా ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలి. పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా తయారు అయిన 24 గంటల్లోపు సర్వీస్ ఓటర్లకు పోస్ట్ ద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారి పంపాలి. పోస్టల్ బ్యాలెట్ తిరిగి ఎంపీడీఓ కార్యాలయానికి చేరినప్పుడు, సంబంధిత ఎన్నికల అధికారి చేరిన సమయం, తేదీని రికార్డు చేయాలి. కౌంటింగ్‌కు ఒక గంట ముందు చేరిన పోస్టల్ బ్యాలెట్లను మాత్రమే లెక్కింపునకు అనుమతిస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ ఏఓ, మండల స్థాయిలో తహసీల్దార్‌లు నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. మొత్తం ప్రక్రియను వీడియో గ్రాఫి చేయాలని, పోటీ చేసే అభ్యర్థులు కూడా ఈ ప్రక్రియను పరిశీలించవచ్చని తెలిపారు. పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీఓలను ఆదేశించారు. పోలింగ్ జరిగే ప్రాంతాలలో ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని సూచించారు. మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో ఈ నెల 6న పోలింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రేపు మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో అభ్యర్థులతో ఎన్నికల వ్యయానికి సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలట్ ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను వివరించారు. ఎన్నికల నిర్వహణకు సమర్థవంతమైన ముందస్తు ప్రణాళిక అత్యవసరమని, సమస్యలు ఏవైనా ఉంటే ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధారిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, డిసెంబర్ 03, 2025

# మెదక్‌లో సీఐటీయూ రాష్ట్ర ఐదో మహాసభలు

- 7న బహిరంగ సభ.. వేలాదిగా తరలిరండి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీఐటీయూ రాష్ట్ర ఐదో మహాసభలు ఈనెల 7 నుంచి 9వరకు మెదక్ పట్టణంలో జరుగనున్నాయి. 7న బహిరంగ సభ నిర్వహిస్తున్నామనీ, ఆ సభలో జాతీయ నేతలు పాల్గొననున్నారని సీఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తెలిపారు. బహిరంగ సభకు కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని సుందరయ్య భవన్ లో మహాసభలకు సంబంధించిన పోస్టర్ ను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఆఫీస్ బేరర్స్ మెట్టు రవి, బొల్లారపు సంపత్, ధరావత్ భాను నాయక్, జిల్లా నాయకులు మంద మల్లేశం, బోట్ల కుమార్ ఆవిష్కరించారు. ఈ రాగుల రమేష్ మాట్లాడుతూ మహాసభల ప్రారంభ రోజున మెదక్ పట్టణంలో బహిరంగసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు ముఖ్యవక్తగా సీఐటీయూ ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు కె.హేమలత, జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని చెప్పారు. మహాసభను అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రారంభిస్తారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొత్తం కార్మిక వర్గానికి ఉచ్చు బిగించిందనీ, దీన్ని ప్రతిఘటించాల్సిన అవశ్యకత కార్మికవర్గం ముందున్నదని గుర్తు చేశారు. యాజమానుల, కార్పొరేట్ల గిరిసెల్లోకి లాభాల వరద పారించేందుకే లేబర్ కోడ్‌లను అమలుచేసిందని విమర్శించారు. కార్మిక హక్కులను తుంగలో తొక్కుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమరశీల పోరాటాలకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా తిరస్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టీ ఉప్పలయ్య మాట్లాడుతూ మహాసభల్లో రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా భవిష్యత్ కార్యచరణను రూపొందించు కున్నట్లు తెలిపారు హనుమకొండ జిల్లా నుండి వివిధ యూనియన్లకు చెందిన 19మంది ప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు..

# దివ్యాంగుల హక్కులపై అవగాహన సదస్సు

- జడ్జి రామలింగం, డా.అనితా రెడ్డి



**వరంగల్ వాయిస్, భీమారం:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని భీమారంలో గల అతిథి మనో వికాస కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల హక్కుల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ మరియు కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హనుమకొండ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రామలింగం, ప్రత్యేక గౌరవ ఆత్మీయ అతిథిగా డాక్టర్ అనితా రెడ్డి పాల్గొన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ రామలింగం మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు అన్ని హక్కులు ఉంటాయని, ముఖ్యంగా వారికి ఆస్తి హక్కు కూడా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని, వారికి ప్రేమను పంచాలని సూచించారు. మానసిక దివ్యాంగులైన చిన్నారులకు ఎలాంటి అవసరాలు ఉన్నా, కోర్టు తరఫున ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. వారి గుర్తింపు కార్డులు, పెన్షన్ కార్డుల ప్రక్రియను సులభతరం చేయాలని; మానసిక నిపుణులు వారిని సందర్శించి సేవలు అందించేలా సంబంధించిన అధికారులకు డీఎల్ఎస్ఏ తరపున లేఖ పంపుతామని తెలిపారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని అన్నారు. మానసిక దివ్యాంగుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దివ్యాంగులను హేళన చేయడం, పిచ్చివారు అనడం, కొట్టడం, కట్టివేయడం వంటి చర్యలు శిక్షార్హులవుతాయని హెచ్చరించారు. హనుమకొండ జిల్లాలోని దివ్యాంగుల సంస్థలన్నీ ఒక వేదిక మీదకి వచ్చి వారి సమస్యలు వివరించినప్పుడు మెరుగైన ఫలితాలు వస్తాయని సూచించారు. దివ్యాంగులకు ఓర్పుతో విద్య నేర్పుతూ, వారికి మానసిక పరిపక్వత వచ్చేలా కృషి చేస్తున్న సంస్థలను ఆమె అభినందించారు. దివ్యాంగుల సేవ దైవసేవ అని, ప్రతి ఒక్కరూ ప్రేమతో వారికి సహాయ సహకారాలు అందించాలని, వారికి అందరిలా అన్ని హక్కులు ఉంటాయని ఆమె పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో జడ్జి రామలింగం, డాక్టర్ అనితా రెడ్డి, సంస్థ నిర్వాహకులు సుజాత పాల్గొన్నారు.

# క్షమాపణ చెప్పిన తర్వాతే నర్సంపేటలో సీఎం పర్యటించాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్



**వరంగల్ వాయిస్, నర్సంపేట:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నర్సంపేట నియోజకవర్గ పర్యటనకు ముందు, నర్సంపేట ప్రజలకు, హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నర్సంపేట పట్టణ విలేకరుల సమావేశంలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంలో విఫలమైందని, గత రెండు సంవత్సరాలుగా ఈ హామీలను అమలు పరచకుండా నర్సంపేట ప్రజలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఈరోజు మళ్లీ ఏ మోసం చేయడానికి సీఎం నర్సంపేట పర్యటన పెట్టుకున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో మొంతా తుఫాను ద్వారా అరుగాలం కష్టపడి పండించిన పంట నష్టపోయిన రైతులను ముఖ్యమంత్రి పరామర్శించకుండా, వారికి పంట నష్టపరిహారం ఇవ్వకుండా కేవలం గ్రామ పంచాయతీ ఎన్నికల కోసమే పర్యటన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి హిందూ దేవుళ్లు, హిందూ సమాజం మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని, యావత్ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పిన తర్వాతే నర్సంపేట నియోజకవర్గ పర్యటన పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి, ముఖ్యమంత్రి సఖ్యతతో ఉండి నర్సంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నామని తెలిపారు. "మీరు క్షమాపణ చెప్పని యెడల, డిసెంబర్ 5న మీ పర్యటనను నర్సంపేట నియోజకవర్గ బీజేపీ పార్టీ అడ్డుకుంటుంది అని హెచ్చరిస్తున్నాము." అని రాణా ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ వడ్డేపల్లి నరసింహా రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, పార్లమెంట్ కో–కన్వీనర్ కట్ల రామచందర్ రెడ్డి, సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, వనపర్తి మల్లయ్య, కుంభం కోమల్ రెడ్డి, శీలం సత్యనారాయణ, మల్యాల సాంబమూర్తి, నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, ప్రధాన కార్యదర్శులు సూత్రపు సరిత, కందికొండ శ్రీనివాస్, కీసరి సాంబరాజు, బట్టు మదన్, వరంగల్ జిల్లా యువ మోర్చా నాయకులు అచ్చ దయాకర్, జూలూరు మనీష్ గౌడ్, ఎర్ర రాజుతో పాటు నర్సంపేట పట్టణ, రూరల్ బీజేపీ, యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి క్రికెట్‌కు ఎంపికైన సెయింట్ థెరిస్సా విద్యార్థి




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా పాఠశాల విద్యార్థి వేల్పుల లెనిన్ తేజ అండర్–14 క్రికెట్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ జాయిస్ తెలిపారు. క్రికెట్‌లో లెనిన్ తేజ కనబరిచిన అద్భుత ప్రతిభకు గుర్తింపుగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో లెనిన్ తేజను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. రాష్ట్ర స్థాయికి ఎంపికైన లెనిన్ తేజను పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ జాయిస్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రోజ్ మీ, పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రోస్ మేరీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా లెనిన్ తేజకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని లెనిన్ తేజకు శుభాకాంక్షలు తెలిపారు.

# అమరుడు కాసోజు శ్రీకాంతా చారికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ చౌరస్తా:** మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఆత్మర్పణం చేసుకొని ఉద్యమాన్ని ఉవ్వెత్తున రగిలించి, తెలంగాణ సాధనలో తొలి అమరుడిగా నిలిచిన దివంగత కాసోజు శ్రీకాంతా చారి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని టైలర్ స్ట్రీట్‌లో హన్మకొండ జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు పానుగంటి శ్రీధర్ గారి ఆధ్వర్యంలో శ్రీకాంతా చారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రోజు మణింద్రనాథ్, కోశాధికారి శ్రీరామోజు సతీష్, ఉపాధ్యక్షులు కొత్తగట్టు బ్రహ్మం, అసం రవి, శ్రీరామోజు మధుసూదన్, శ్రీధర్, శ్రీనివాస్, కట్ట సంపత్, జగన్, కిరణ్, మనోజ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా మూడో విడత నామినేషన్లు




**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు సంబంధించిన మూడో విడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. తొలి రోజు కావడంతో నామినేషన్ల దాఖలు మందకోడిగా ఉన్నప్పటికీ, ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు త్రిముఖ పోటీ ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం మరియు శుక్రవారం రోజుల్లో భారీ స్థాయిలో నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చూసేందుకు, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద శాయంపేట పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

# హిందూ మనోభావాలు దెబ్బతీసినందుకు సీఎం క్షమాపణ చెప్పాలి

## బీజేపీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హిందూ దేవతలపై, హిందూ సమాజంపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ తీవ్రంగా మండిపడ్డారు. హనుమకొండలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వెంటనే హిందువులకు బేషరతుగా క్షమాపణలు చెప్పి, ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. "తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కాదు, రివంతుద్దీన్ గా మార్చుకుంటే బాగుంటుంది. ముఖ్యమంత్రి హోదాలో ఉండి హిందూ మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం సిగ్గుచేటు" అని డా. వన్నాల విమర్శించారు. సీఎం వెంటనే క్షమాపణ చెప్పకపోతే, తెలంగాణలో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. వెంటనే గవర్నర్ , రాష్ట్రపతి చొరవ తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాల్సిందిగా ఆయన కోరారు. ఇలాంటి చౌకబారు మాటలు ఆపి, సాధ్యం కానీ దొంగ వాగ్దానాలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి, ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి డైవర్షన్ రాజకీయాలతో ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. ఇంకా టైంపాస్ చేస్తే, తెలంగాణ సమాజం, ప్రజలు, హిందువులు రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ మంత్రులను అడ్డుకునే పరిస్థితి రానున్నదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి, ఒక హిందువు అయి ఉండి హిందూ దేవతల పట్ల చేసిన ఈ చులకన మాటలను బీజేపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది అని డా. వన్నాల వెంకటరమణ స్పష్టం చేశారు.

# భారత్ వికాస్ పరిషత్ 'సేవలు హర్షణీయం'

## కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఛారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారు పేద విద్యార్థులను ఆదుకొని, వారికి ఉపకార వేతనాలను అందించడం హర్షణీయమని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్ లో బీవీపీ ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో, భారత్ వికాస్ పరిషత్ ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పేదరికంలో ఉండి, తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, తమ లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. తద్వారా తమ తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలని సూచించారు. మార్పు అనేది ఒక్క వ్యక్తి పూనుకుంటేనే సాధ్యపడుతుందని, గాంధీ, అబ్దుల్ కలాం ఆజాద్ వంటి మహనీయుల జీవితాలే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు స్వామి వివేకానందుని స్ఫూర్తితో తమ వ్యక్తిత్వ నిర్మాణం చేసుకోవాలని, ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఇటీవల సైబర్ నేరగాళ్ల ఆగడాలు పెరుగుతున్నాయని, ప్రజలు వారి ఉచ్చులో పడవద్దని ఆత్మకూరు సీఐ ఆర్. సంతోష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూర్ మండల కేంద్రంలో గ్రామస్తులు, యువతకు సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు తరచుగా ఆన్‌లైన్ మోసాలు లేదా నేరాల్లో చిక్కుకున్నారని ఫోన్లలో బెదిరింపులు చేసి డబ్బులు గుంజుతున్నారని తెలిపారు. అలాంటి సంఘటనలు ఎవరికి ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఆయన తెలియజేశారు. సైబర్ నేరాల పైన ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఆర్థిక నేరాలను అరికట్టడంలో పోలీసులకు సహకరించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

# దివ్యాంగ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

## ➲ టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, జనగామ :** వికలాంగులైన ఉపాధ్యాయులకు గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. వికలాంగులైన ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, వారికి విధులు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. విధులను నిర్వర్తించలేమని, మినహాయించాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ వాటిని పట్టించుకోలేదని ఆరోపించారు. సహాయ జిల్లా ఎన్నికల అధికారి అయిన జనగామ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సదరు ఉపాధ్యాయులకు శిక్షణకు హాజరు కాలేదన్న నెపంతో షోకాజ్ నోటీసులు పంపి వారిని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం రోజు అయిన డిసెంబర్ 3న వికలాంగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి అవమానపరచడం విచారకరమని ఆయన అన్నారు. వికలాంగులకు, గుండె సంబంధిత, కిడ్నీ, క్యాన్సర్, న్యూరో తదితర తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు కేటాయించిన విధులను వెంటనే రద్దు చేయాలని, వారికిచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సహాయ ఎన్నికల అధికారికి ప్రాతినిధ్యం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంకుషావలి, జిల్లా కార్యదర్శి వజ్రయ్య పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థి నేర చరిత్ర గోప్యం

## నామినేషన్ తిరస్కరణకు డిమాండ్

## సెల్ఫ్ డిక్లరేషన్‌లో వివరాలు దాచిపెట్టినట్లు ఆరోపణ



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్:** మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తీవ్ర వివాదం చెలరేగింది. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి భాషబోయిన పోశాలు నామినేషన్ పత్రాల్లో తన నేర చరిత్రను గోప్యంగా ఉంచారని మిగతా అభ్యర్థులు ఎన్నికల అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎన్నికల నియమాల ప్రకారం స్థిర ఆస్తులు, నేర చరిత్ర వివరాలను సెల్ఫ్ అఫడవిట్‌లో తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉండగా, పోశాలు దీనికి విరుద్ధంగా వ్యవహరించి, తన నేర చరిత్రను పూర్తిగా దాచిపెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. పోశాలుపై రేగొండ, ఘనపూర్, హసన్ పర్తి, కేయూ, ఎనమాముల పోలీస్ స్టేషన్లలో పదికి పైగా కేసులు నమోదయ్యాయని, పలుమార్లు ఆయన జైలుకు సైతం వెళ్లి వచ్చారని తోటి సర్పంచ్ అభ్యర్థులు ఆధారాలతో సహా రిటర్నింగ్ అధికారికి అందజేశారు. నేరచరిత్రను నామినేషన్ పత్రంలో పొందుపరచకపోవడం నేరమని, ఇది ఎన్నికల అధికారులను తప్పుదోవ పట్టించడమేనని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. మిగతా సర్పంచ్ అభ్యర్థులు బుధవారం వెంకటాపూర్ మండల కేంద్రానికి చేరుకొని ఆర్‌ఓకి ఫిర్యాదు చేసినప్పటికీ, సంబంధిత ఎన్నికల అధికారులు ఆ అంశాన్ని పెద్ద నేరం కాదన్నట్టుగా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారులు పోశాలుకు ఎందుకు మద్దతిస్తున్నారో అర్థం కావడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ఒక అభ్యర్థిపై ఇలాంటి ఆరోపణ వచ్చినప్పుడు, మండల స్థాయి అధికారి, స్థానిక ఎస్సైని పిలిపించి నేర చరిత్రకు సంబంధించిన వివరాలను సేకరించాల్సి ఉంటుందని, అలా కాకుండా అధికారులు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వారు వెల్లడించారు. ఆరోపణలు వచ్చిన అభ్యర్థి ఎలాంటి కేసులు లేవని సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉన్నా, ఆ విషయంలో కూడా తాత్సారం చేయడం సరికాదని మండిపడ్డారు. ఆర్వో ఈ అంశంపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే, ఆర్డీఓతో పాటు జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు మిగతా సర్పంచ్ అభ్యర్థులు తెలిపారు. అంతేకాకుండా, అవసరమైతే ఈ అంశంపై కోర్టుకు కూడా వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు.

# పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి



**వరంగల్ వాయిస్, మెదక్ :** జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీరామ్ కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించిన పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. ఉద్యోగులకు మరియు వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని అమలు చేయాలన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో విడుదల చేసిన జీవో 60 ను బేస్ చేసుకుని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 1195 ప్రకారం ప్రతి ఒక్క డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.19,500 చొప్పున చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమకు కూడా ప్రతి నెలా 1వ తేదీన వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని మహేష్ గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహృదయంతో తగు చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు కోట, శ్రీలత, దుర్గారాజ్ గౌడ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# కేయూ నెట్‌వర్కింగ్ ఆధునికీకరణకు బీఎస్ఎన్ఎల్‌తో ఒప్పందం

## ◆ రూ. 1.29 కోట్లతో క్యాంపస్‌లో ఇంటర్నెట్ వ్యవస్థ సామర్థ్యం పెంపు



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్ నెట్‌వర్కింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా, ఆధునికంగా మార్చేందుకు భారత ప్రభుత్వ రంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ కు వర్క్ ఆర్డర్ జారీ చేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం తెలిపారు. ఈ వర్క్ ఆర్డర్ కింద బీఎస్ఎన్ఎల్ సహకారంతో రూ.1 కోటి 29 లక్షలు వెచ్చించనున్నట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు. రూసా నిధులతో ఈ నెట్‌వర్కింగ్ ఆధునికీకరణ చేపట్టనున్నారు. విశ్వవిద్యాలయ కే.హబ్‌లో స్టార్టప్స్/అంకుర సంస్థలను ప్రోత్సహించడం. మౌలిక వసతులను అభివృద్ధి చేయడం. క్యాంపస్‌లో ఇంటర్నెట్ సదుపాయాలను మరింత మెరుగుపరచడం. రూసా అనుమతి పొందిన ప్రాజెక్టులకు, ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న రీసెర్చ్ ప్రాజెక్టులకు అవసరమైన నెట్‌వర్క్ మద్దతును విస్తరించడం. వర్క్ ఆర్డర్‌కు సంబంధించిన విధులు, విధానాలపై వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి మరియు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఎస్ఎన్ఎల్ తరపున జనరల్ మేనేజర్ అరవింద్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.కిషన్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సురేష్, రజనికర్ రెడ్డి, డివిజనల్ ఇంజనీర్లు, కాకతీయ విశ్వవిద్యాలయం తరపున రూసా నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, అభివృద్ధి అధికారి ఆచార్య ఎన్.వాసుదేవ రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా.బి.రమ, క్యాంపస్ నెట్‌వర్కింగ్ సంచాలకులు డా.డి.రమేష్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొని నెట్‌వర్కింగ్ వ్యవస్థ ఆధునికీకరణపై చర్చించారు.



# ప్రియాంక చోప్రాకు కల్కిలో ఆఫర్?

ప్రపంచవ్యాప్తంగా స్టార్‌డమ్ సంపాదించిన గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రాకు తెలుగు ప్రేక్షకులలోను ప్రత్యేక గుర్తింపు ఉంది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేసుకున్న ఆమె మహేష్ బాబు ` ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం వారణాసిలో మందాకిని అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈవెంట్‌లో ప్రియాంక తన లుక్‌తో ఆకట్టుకుంది. అయితే ఒకవైపు వారణాసి చిత్రం చేస్తున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు మరో తెలుగు సినిమాకి సైన్ చేసిందని అంటున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కల్కి 2 కోసం ఆమెని సంప్రదించగా దానికి ప్రియాంక గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. కల్కి తొలి పార్ట్‌లో నటించిన దీపికా పదుకొణెళి పలు కారణాల వలన తప్పుకోవడంతో ఆ స్థానంలో ప్రియాంకని తీసుకుంటున్నట్టు టాక్ .సీక్వెల్‌లో కమల్ హాసన్ విలన్‌గా కనిపించి తన నటనతో ప్రేక్షకుల మైండ్ బ్లాక్ చేయనున్నాడు. సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఫ్యాషన్ చిత్రంతో జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందారు. ఆ తర్వాత హాలీవుడ్‌లో క్వాంటికో, బేవాచ్, సిటాడెల్ వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించారు. రామ్ చరణ్‌తో కలిసి ఆమె నటించిన జంజీర్ రీమేక్‌తో టాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. ఆ చిత్రం తెలుగులో తుఫాన్‌గా విడుదలైంది.

# వర్కింగ్ అవర్స్‌తో సినిమా నడవదు



## ఔట్‌పుట్ రావాలంటే.. సమిష్టిగా పనిచేయాల్సిందే

### తాజాగా నటులు రానా, దుల్కర్ సల్మాన్ వ్యాఖ్యలు

బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణెళి ఇటీవల వర్కింగ్ అవర్స్‌పై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. రోజుకు ఎనిమిది గంటల పని చాలు.. అతిగా వర్క్ చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు అని ఆమె చెప్పిన మాటలు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ వ్యాఖ్యల కారణంగా ఆమెను 'స్పిరిట్', 'కల్కి 2' ప్రాజెక్టుల నుంచి తప్పించేశారని వచ్చిన వార్తలు మరింత వివాదాన్ని రేకెత్తించాయి. జీవితం `పని మధ్య బ్యాలెన్స్ చాలా అవసరం అని దీపిక చెప్పిన మాటలకి పలువురు సెలబ్రిటీలు ఆమెకు మద్దతు తెలిపారు. మనసు, శరీరం ఒత్తిడిలో ఉన్నప్పుడు మంచి అవుట్‌పుట్ సాధ్యం కాదని కూడా ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ వివాదంపై నటుడు దగ్గుబాటి రానా తాజాగా స్పందించారు. సినిమా ఇండస్ట్రీ సాధారణ ఉద్యోగం కాదు. నటన ఒక లైఫ్‌స్టైల్. ఎనిమిది గంటలు కూర్చొని అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చే ఫీల్డ్ ఇది కాదని రానా వెల్లడిరచారు. ఒక మంచి సీన్ రావాలంటే కెమెరా నుంచి లైటింగ్ వరకు, నటీనటులు నుంచి టెక్నీషియన్ల వరకూ అందరూ సమయం పట్టించుకోకుండా అంకితభావంతో పని చేస్తారని ఆయన అన్నారు. నటుడు దుల్కర్ సల్మాన్ కూడా ఈ విషయంపై తన అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ పరిశ్రమలలో వర్క్ మోడల్ ఒక్కో రకంగా ఉంటుంది. తెలుగులో మహానటి చేస్తున్నప్పుడు కొన్నిసార్లు సాయంత్రం ఆరు గంటలకే షూటింగ్ అయిపోయేది. తమిళంలో  ఆదివారాలు కూడా సెలవు ఇస్తారు. ఒక రోజు అతిగా పనిచేయడం కంటే, రోజూ కొంచెం అదనంగా పనిచేయడం బెస్ట్ అని దుల్కర్ స్పష్టం చేశారు. మలయాళంలో షూటింగ్ ప్రారంభించిన తర్వాత ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా తెలియదు.. దీపికా పదుకొణెళి వ్యాఖ్యలపై రానా,దుల్కర్ స్పందించడంతో సినీ పరిశ్రమలో వర్కింగ్ అవర్స్‌పై చర్చ మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది.



# ఐటమ్ సాంగ్‌లతో పూజ అదుర్స్

అల్లు అర్జున్`అట్లీ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు ప్రచారం తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోలందరి సరసన వరుసగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే, గత కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె నటించిన కొన్ని పెద్ద సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా స్టార్ ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదు. గ్లామర్, డాన్స్, స్కీన్ ప్రెజెన్స్ లాంటి అంశాల్లో పూజాతో సరితూగే వారు లేరని చెప్పాలి. అల్లు అర్జున్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, రామ్ చరణ్ వంటి అగ్రనటులతో నటించటం ఆమె కెరీర్‌కే ప్రత్యేక గుర్తింపునిచ్చింది వరుస ఫ్లాప్‌ల వల్ల లీడ్ రోల్స్ తగ్గినా, పూజా మాత్రం వెనక్కి తగ్గలేదు. హీరోయిన్‌గా కాకపోయినా, స్పెషల్ సాంగ్స్, స్పెషల్ రోల్స్ చేసుకుంటూ తన స్టార్ ప్రెజెన్స్‌ను కొనసాగించాలని నిర్ణయించుకుంది. 'కూలీ' సినిమాలో 'మౌనిక' సాంగ్ విజయంతో పూజా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె డాన్స్, లుక్స్, గ్లామర్ ఆ పాటను దక్షిణాది వ్యాప్తంగా వైరల్ చేశాయి. ఈ సాంగ్ హిట్ తర్వాత పూజాకు స్పెషల్ సాంగ్ ఆఫర్లు వరుసగా వస్తున్నాయి. ఇండస్ట్రీ టాక్ ప్రకారం, అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ ప్రాజెక్ట్‌లోని ప్రత్యేక గీతం కోసం పూజా హెగ్డేను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సాంగ్ కోసం ఆమెకు రూ.5 కోట్లు పారితోషికం ఆఫర్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్స్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఒక ఐటెమ్ సాంగ్‌కి ఇది అరుదైన భారీ రేమ్యునరేషన్. ఇది పూజా మార్కెట్ ఇంకా బలంగానే ఉందని మరోసారి నిరూపిస్తోంది. సినిమా అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం పూజా హాట్ ఫేవరెట్. 2010లో మిస్ ఇండియా పోటీలో రెండోస్థానం సాధించి గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టిన పూజా హెగ్డే 2012లో తమిళం 'ముగమూడి' ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. 2014లో వరుణ్ తేజ్ సరసన 'ముకుంద' తో టాలీవుడ్‌కి పరిచయం కాగా, ఆ తర్వాత 'ఒక లైలా కోసం', బాలీవుడ్‌లో 'మోహెంజో దారో' వంటి సినిమాలతో ప్రయాణం కొనసాగించింది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలకంటే స్పెషల్ సాంగ్‌లపైనే దృష్టి పెడుతుంది. స్పెషల్ సాంగ్‌లతో తన మార్కెట్‌ను తిరిగి పదిలం చేసుకుంటున్న పూజా, త్వరలోనే మళ్లీ స్టార్ హీరోల సరసన హీరోయిన్‌గా కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయని టాక్.

# కార్తీ... తెలుగులో అన్నగారు వస్తారు



స్టార్ నటుడు కార్తీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం వా వాతియార్. తెలుగులో ఈ చిత్రం అన్నగారు వస్తారు అనే పేరుతో విడుదల కాబోతుంది. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కృతి శెట్టి కథానాయికగా నటిస్తుండగా.. సత్యరాజ్, రాజ్‌కిరణ్, జిఎం సుందర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కెఇ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి తాజాగా విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. ఈ సినిమాను డిసెంబర్ 12న తమిళంతో పాటు తెలుగులో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో కార్తీ పోలీస్ పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు కార్తీ సర్దార్ 2ని కూడా విడుదలకు సిద్ధం చేస్తున్నాడు.



ఆనందంతో మాటలు రావడం లేదు

## ఎమోషనల్ పోస్ట్ పంచుకున్న రాజ్ సోదరి శీతల్

ఇక డిసెంబర్ 2న సమంతకు అత్త వారింట్లో గ్రాండ్ వెల్‌కమ్ లభించింది. ఈ మేరకు రాజ్ సోదరి శీతల్ ఈ జంటకు విషెస్ చెబుతూ ఒక ఎమోషనల్ నోట్ పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫ్యామిలీ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఆనందంతో మాటలు రావడం లేదు. గొప్ప భక్తుడు ఆర్తితో నిండిన హృదయంతో శివలింగాన్ని ఆలింగనం చేసుకుంటే ఎంత ఆనందంగా ఉంటాడో ఈరోజు నేను అలా ఉన్నాను. ఆనందబాష్పాలతో నా హృదయం ఉప్పొంగుతోంది. నేడు మా కుటుంబం పరిపూర్ణమైంది. సమంత ` రాజ్ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకుసాగుతుండడం చూసి మాకెంతో గర్వంగా ఉంది. ప్రశాంతతో నిండిపోతుంది. మేము వీరికి ఎప్పుడూ అండగా ఉంటాము‘ అని రాసుకొచ్చారు.




# గళమెత్తిన నాలుగో స్తంభం

- **సమస్యల పరిష్కారం కోరుతూ మహా ధర్నా**
- **హైదరాబాద్ కు భారీగా తరలిన జర్నలిస్టు నాయకులు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ టౌన్ :** ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించిన మహా ధర్నాకు బుధవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి భారీగా జర్నలిస్టులు తరలి వెళ్లారు. ఉదయం 7 గంటలకు హనుమకొండ హరిత కాకతీయ హోటల్ నుంచి బయలుదేరి హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల కార్యాలయంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్స్, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాల మాదిరిగానే అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. ఎంతో కాలంగా జర్నలస్ట్ వృత్తినే నమ్ముకొని చాలీ చాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న వారికి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. హనుమకొండ నుంచి తరలి వెళ్లిన వారిలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వేణుమాధవ్, కంకనాల సంతోష్, జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గడ్డం కేశవ మూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు నల్లాల బుచ్చిరెడ్డి, నార్లగిరి యాదగిరి డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, సీహెచ్ సోమనర్సయ్య, ఎం.రాజేంద్ర ప్రసాద్, సాయిరాం, వలిశెట్టి సుధాకర్, కె.దుర్గా ప్రసాద్, ఎండి నయీం పాషా, శ్రీహరి రాజు, బి.విజయ్ రాజ్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.










# ఖబడ్దార్ రేవంత్ రెడ్డి..

- **హిందూ దేవతల జోలికి వస్తే ఊరుకునేది లేదు**
- **బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హిందువుల ఓట్లతో గెలిచి హిందూ దేవతలపై ముఖ్యమంత్రి హోదాలో ఉండి అనిచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. ఇలాంటి వాఖ్యలు చేస్తే ఖబర్దార్ రేవంత్ రెడ్డి అంటూ హెచ్చరించారు. బీజేపీ జిల్లా ఇంచార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హిందూ దేవతలపై అనుచిత వాక్యాలు చేసి మెజారిటీ ప్రజల మనోభావాలు దెబ్బతిసే విధంగా గాంధీభవన్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు. హిందూ దేవుళ్లను, ఆచారాలను కించపరిస్తే సహించేది లేదన్నారు. హిందూ దేవీ – దేవతలపై, హిందూ సమాజంపై వ్యంగ్య భాషను వాడి, అనుచిత వ్యాఖలు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన హిందూ ద్వేషాన్నివెళ్లగక్కాడని మండిపడ్డారు. ఈ విద్వేషపూరిత వైఖరికి నిరసనగా వరంగల్ చౌరస్తా లో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిత్రం ఉద్యమ సజీవ దృశ్యం

**☐ దాస్యం వినయ్ భాస్కర్**

**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** చిత్రం ఉద్యమ సజీవ దృశ్యమని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా ఫొటో ఎగ్జిబిషన్, కేసీఆర్ పై రాసిన పుస్తకాల ప్రదర్శనను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ప్రొఫెసర్ శోభ హాజరై ఫొటో ఎగ్జిబిషన్, కేసీఆర్ పై రాసిన పుస్తకాల ప్రదర్శనను ప్రారంభించి ఉద్యమ నాటి ఫోటోలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం తెలంగాణ మలి దశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతా చారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షా, అమరుల త్యాగం, సకల జనుల పోరాటంతోనే స్వరాష్ట్రం సిద్ధించిందని అన్నారు. ఫొటో చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తుందని తెలిపారు. మలి దశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతా చారి ప్రాణ త్యాగం మరువలేనిదని అన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు కేసీఆర్ , బీఆర్ఎస్ పార్టీ అండగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్ సంకు నర్సింగ రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు పులి రజినీకాంత్, జానకి రాములు, నాయీముద్దీన్, మనోజ్ కుమార్, సదాంత్, ఖలీల్, శ్రీధర్, శ్రీకాంతా చారి, చందర్, పుల్లయ్య, రమేష్, వీరాస్వామి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com